క్లుప్తంగా

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ


మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసాపురం: పర్యావరణహితం కోసం ప్రతి ఒక్కరూ గణపతి పూజలో మట్టి విగ్రహాలను ఉపయోగించాలని కాపు వనితాక్లబ్ రీజినల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి సూచించారు. బుధవారం కాపు వనితాక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బాలగణపతి ఆలయం వద్ద వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. క్లబ్ ఉపాధ్యక్షురాలు పిప్పళ్ల సుప్రియ సౌజన్యంతో విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రసాయన రంగులతో తయారు చేసి విగ్రహాలు నిమర్జనం చేయడం ద్వారా నీరు కలుషితం అవుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు బండి స్వర్ణలత, పుష్పాల ఉషాకమల, తోట భారతి, సుంకర రాజకుమారి పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న పెన్మెత్స బుద్ధరాజు

పాలకొల్లు అర్బన్: పోడూరు గ్రామానికి చెందిన చప్పిడి సత్యవతికి వసుధ ఫౌండేషన్ రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు బుధవారం అందజేశారు. సత్యవతి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్లు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించి ఆర్థిక సహాయం చేశారు.

వరద బాధితులకు అండ


వాసవీ శాంతి థాంలో వరద బాధితులకు పులిహోర పొట్లాలను తయారు చేస్తున్న దృశ్యం

పెనుగొండ: వరదలతో విలవిల్లాడుతున్న విజయవాడ ప్రజలకు అఖిలభారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ శాంతి థాం అండగా నిలిచింది. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీఎస్ గోవిందరాజులు సూచనల మేరకు 2500 పులిహోర పొట్లాలు, 2500 వాటర్ ప్యాకెట్లును ప్యాకింగ్ చేసి పెనుగొండ తహసీల్దారు జి.అనిత కుమారి ద్వారా విజయవాడ రూరల్ ప్రజలకు వీటిని పంపిణీ చేయించారు. వరద బాధితులకు అండగా నిలిచిన వాసవీ శాంతి థాం నిర్వాహకులను పలువురు అబినందించారు.

వాన తెచ్చిన తంటా

- ఎడతెరపి లేని వానతో ప్రజల పాట్లు
- రహదారుల్లో నిలిచిపోయిన నీరు

పెనుగొండ: ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం తెల్లవారు జాము నుంచి కురిసిన కుండపోత వర్షంతో ప్రజలు అల్లాడిపోయారు. తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకూ వర్షం పడుతూనే ఉండడంతో శివారు ప్రాంతాలు, కాలనీలు వర్షపు నీటితో నిండిపోయాయి. ముఖ్యంగా పెనుగొండ కోడి పందేల దిబ్బలో రహదారులన్నీ జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగిపొర్లడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహించింది. మధ్యాహ్నం వరకూ వర్షం పడుతుండడంతో జన జీవనం స్తంభించింది. ప్రజలు ఇళ్లు విడిచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.

పెరుగుతున్న గోదావరి

భారీ వర్షాలకు తోడు, ఎగువ నుంచి వరద నీరు భారీగా వస్తుండడంతో సిద్ధాంతంలో గోదావరి నీటి మట్టం పెరుగుతుంది. దీంతో పెనుగొండ సీఐ ఎస్.రజనీకుమార్, ఎస్సై కె.గంగాధర్ సిద్ధాంతం, నడిపూడి, దొంగరావిపాలెంల్లో వరద పరిస్థితులను పరిశీలించారు. అత్యవసరమైతే తప్ప గోదావరి లంకల్లో వెళ్లవద్దంటూ రైతులకు సూచనలు చేశారు. వరద నీరు దిగువకు వస్తుండడంతో నీటి మట్టం పెరుగుతుందని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: మండలంలో గత నెల 31 నుంచి ఈ నెల మూడో తేదీ వరకు సుమారు 114.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు మరో 19.4 మిల్లీ మీటర్ల వర్షం కురవడంతో చేలు ఏరులను తలపిస్తుండగా, పల్లపు ప్రాంతాలతో పాటు మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆవరణలో నీరు నిలిచిపోవడంతో విద్యార్థులతో పాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కాళీపట్నం, కేపీ పాలెంలో ప్రధాన రహదారులపైకి వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. కాళీపట్నం పడమర గ్రామంలో పలు చోట్ల ఇళ్లల్లోకి నీరు చేరే అవకాశం ఉండటంతో సర్పంచ్ కవురు సావిత్రి ఆదినారాయణ నిలిచిపోయిన నీటిని బయటకు తోడిస్తున్నారు. మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆవరణ పూర్తిగా మునిగిపోవడంతో నాలుగు ప్రాంతాల్లో ఇంజిన్లు వేసి నీటిని బయటకు తోడేలా సర్పంచ్ పడవల మేరీ, ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు నీరు తొలగించే పనులను పర్యవేక్షిస్తున్నారు.

చెరువులన తలపిస్తున్న పంట చేలు

పాలకొల్లు అర్బన్: అధిక వర్షాల కారణంగా పంట చేలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. గత వారం రోజుల నుంచి కురుస్తు వర్షాల వల్ల మండలంలోని 350 ఎకరాల్లోని పంట చేలు ముంపు బారిన పడ్డాయి. వీటిలో తిల్లపూడి, శివదేవునిచిక్కాల, వెలివెల గ్రామాల్లో ఎక్కువ వరి చేలు నీట మునిగాయి. ఏడీఏ అడ్డాల పార్వతి, ఏఓ కె.రాజశేఖర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. వెలివెల కాలిబాట వంతెనకు ఆనుకుని భగ్గేశ్వరం డ్రెయిన్‌లో చెత్త అడ్డుపడింది. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. దీంతో వ్యవసాయాధికారులు కూలీలతో చెత్తను తొలగించే ఏర్పాట్లు చేశారు. ఆగర్రు, ఆగర్తిపాలెం, గోరింటాడ, దిగమర్రు, నగంచెరువు గ్రామాల్లో పాక్షికంగా వరిచేలు నీట మునిగినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.


సిద్ధాంతంలో పెరుగుతున్న గోదావరి


పెనుగొండ కోడి పందేల దిబ్బలో కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


మొగల్తూరు ఉన్నత పాఠశాలలో నిలిచిన వర్షపు నీరు


వెలివెల కాలిబాట వంతెన వద్ద చెత్తను తొలగిస్తున్న దృశ్యం


శేరేపాలెంలో మునిగిన చేలు


తిల్లపూడిలో చెరువును తలపిస్తున్న పంటచేలు


పెనుగొండ కాలనీలో వర్షపు నీరు

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

నరసాపురం: క్యాన్సర్ వ్యాధిపై మహిళలు అవగాహనతో ఉండాలని గ్రంధి విజయలక్ష్మి, సత్యనారాయణ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, గైనకాలజిస్ట్‌ల సంఘం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మాదంశెట్టి పద్మావతి సూచించారు. పట్టణంలోని అశ్వని ఆసుపత్రిలో బుధవారం ఉచిత రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా గత 15 ఏళ్లుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వారా కాన్సర్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. 30 సంవత్సరాలు దాటిన తరువాత తరచూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాదంశెట్టి కోటేశ్వరరావు, బళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నోటీసుల తిరస్కరణ


నోటీసులను తిరస్కరించి ఆందోళన చేస్తున్న ఆక్రమణదారులు

ఆకివీడు : స్థానిక అయిభీమవరం రోడ్డు ప్రాంతంలోని మూలలంక బోదె గట్టు ఆక్రమణల్ని తొలగించేందుకు బుధవారం నగర పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసుల్ని ఇచ్చేందుకు వెళ్లిన నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బందికి ప్రతిఘటన ఎదురైంది. నోటీసులు తమ గోడలపై అంటించవద్దని ఆక్రమణదారులు ప్రతిఘటించారు. అయినా కొన్ని ఇళ్ల గోడలకు నోటీసులు అంటించడంతో సిబ్బందిని బాధితులు, సీపీఎం నాయకులు కె.తవిటినాయుడు, బీవీ వర్మ, సందక సూరిబాబు, బి.రాంబాబు, డోకల లక్ష్మి, రవితేజ తదితరులు నిలదీశారు. దీంతో నగర పంచాయతీ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై నాగరాజు రంగ ప్రవేశం చేసి బాధితుల్ని వారించారు. తమకు ఇళ్ల స్థలం కేటాయించి, రూ.4 లక్షలు సాయం అందించాలని, ఏడాది గడువు ఇవ్వాలని బాధితుల డిమాండ్ చేశారు. ఘటనా స్థలం వద్ద బాధితులు ధర్నా చేయడంతో దీంతో కొంత సేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఘటనా స్థలానికి తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సీఐ జగదీశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

భీమవరం: బీజేపీ సభ్యత నమోదు కార్యక్రమం జిల్లాలో ప్రారంభమైందని 45 రోజుల వరకు కొనసాగుతుందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. బుధవారం బీజేపీ స్థానిక జిల్లా కార్యాలయంలో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ బీజేపీ సభ్యత్వం తీసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి పేరిచర్ల వెంకట శ్రీనివాసరాజు (సుభాష్), అసెంబ్లీ కన్వీనర్ కాయిత సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

పాలకొల్లు సెంట్రల్: పట్టణ పరిధిలోని జీవీఎస్‌వీఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో, పాలకొల్లు సప్తనిధి లిమిటెడ్ ఫౌండర్ క్లబ్ చైర్మన్ స్వామి నాయుడు ఆధ్వర్యంలో బుధవారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానం వైపుగా తీసుకువెళ్లే శక్తి ఒక్క గురువుకే ఉందన్నారు. తల్లిదండ్రుల తర్వాత గురువులు దైవంతో సమానమని సకల శాస్త్రాలు చెబుతున్నాయని అన్నారు. ఒక మంచి గురువు విద్యార్థులకు అందించిన విద్య ద్వారా మాత్రమే మెరుగైన సమాజం ఏర్పడడం సాధ్యపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ముందుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యా రంగంలో విశేష సేవ అందిస్తూ విద్యార్థులను ఉన్నత స్థితిలోకి తీసుకువచ్చిన నారాయణ రావు మాస్టారు, పాలకొల్లు మండలంలో పనిచేస్తున్న ఉన్నమట్ల చిన్నయ్య, పాలకొల్లు పట్టణం జీవీఎస్‌వీఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీ ప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ హేమచంద్ర రావు, రాంకీరెడ్డి, బ్రాంచ్ డెవలప్‌మెంట్ మేనేజర్ కిరణ్ కుమార్ పిల్లి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

అధ్వానంగా ఏటిగట్టు లైటింగ్

నరసాపురం: నరసాపురం గోదావరి ఏటిగట్టు పొడవునా వీధి లైట్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడా సవ్యంగా లైట్లు వెలగడం లేదు. కొన్నిచోట్ల పోయిన లైట్లను మునిసిపల్ అధికారులు తిరిగి ఏర్పాటు చేయడం లేదు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వలందర్‌రేవు, లలితాంబ ఘాట్ వద్ద, పడవల రేవు తప్పిస్తే ఏటిగట్టు పొడవునా మరెక్కడా వీధి దీపాలు వెలగడం లేదు. ప్రస్తుతం వర్షాలు అధికంగా పడుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ ఏటిగట్టు ప్రాంతానికి సాయంత్రం వేళల్లో పట్టణవాసులు పెద్ద సంఖ్యలో సేద తీరేందుకు వస్తారు. రాత్రి పూట వీధి దీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంతమంతా అంధకారంతో ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మొగల్తూరు సొసైటీపై 51 విచారణ

నరసాపురం రూరల్: మొగల్తూరు సహకార సంఘంపై గతంలో నిలిచిపోయిన 51 విచారణకు ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. గతంలో సంఘ ఆడిట్ అధికారుల ఆదేశాలతో అప్పట్లో 51 విచారణ చేపట్టారు. అయితే సహకార మంత్రి విచారణ నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వడంతో విచారణ నిలిచిపోయింది. ప్రస్తుత ప్రభుత్వంలో పలువురు గతంలో నిలిచిపోయిన విచారణను కొనసాగించాలంటూ ఫిర్యాదు చేయడంతో గతంలో ఉన్న స్టేను రద్దు చేసి తిరిగి మొగల్తూరు సహకార సంఘం పరిధిలో నిలిచిపోయిన విచారణను తిరిగి ప్రారంభించాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ఇదే విషయమై జిల్లా సహకార అధికారులు కూడా వివరణ కోరగా స్టే ఉపసంహరించుకున్నారని విచారణ ప్రారంభించనునన్నట్లు తెలిపారు.

14న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: నరసాపురం కోర్టు ఆవరణలో ఈనెల 14వతేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.విజయదుర్గ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పోలీసులు, న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజీ చేసుకోదగిన సివిల్, క్రిమినల్ అన్ని కేసులు పరిష్కరించుకోవచ్చని వివరించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా చింతయ్య


దొంగ చింతయ్య

నరసాపురం రూరల్: కాళీపట్నం ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు దొంగ చింతయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ముత్యాలపల్లికి చెందిన చింతయ్య అదే గ్రామంలోని బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఆయన సేవలను గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు.

ఆహార పదార్థాల పంపిణీ

పెనుగొండ: అక్షయ పాత్ర ఆధ్వర్యంలో బుధవారం వడలి ఎన్టీఆర్ కూడలిలో పేదలకు ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. పెనుగొండ ఆర్యవైశ్య సత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మిగిలిన ఆహార పదార్థాలను అక్షయ పాత్ర సభ్యులు సేకరించి నిరుపేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అక్షయ పాత్ర సభ్యులు ఉప్పలపాటి చంటి, మేకా సురేష్, మండల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలకు బ్రేక్


మంగళగుంటపాలెంలోని టౌన్ లే అవుట్‌లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు


వైఎస్సార్ సీపీ హయాంలో పూర్తయిన ఇళ్లు

- కూటమి ప్రభుత్వంలో ముందుకు కదలని నిర్మాణాలు
- టౌన్ లే అవుట్‌లో మందకొడిగా నిర్మాణాలు

నరసాపురం రూరల్: మండలంలోని జగనన్న కాలనీల్లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పక్కా గృహాల నిర్మాణాలకు బ్రేక్ పడింది. మంజూరైన ఇంటి స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు నిరాసక్తత చూపుతున్నారు. దీంతో పక్కా గృహాల నిర్మాణాలు ముందుకు కదలడంలేదు. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండలాలు, నరసాపురం పట్టణంలో కలిసి మొత్తం 68 లే అవుట్లు ఏర్పాటు చేసి, 7,603 మందికి పక్కా గృహాలు మంజూరు చేశారు. హౌసింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో 3,172 పక్కా గృహాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. గృహ ప్రవేశాలు జరిగాయి. మరో 164ఇళ్ల స్లాబులు పూర్తయ్యాయి. 1,179 గృహాలు వివిధ దశల్లో నిర్మాణమవుతున్నాయి. 3,088ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. ఎన్నికల కోడ్ వచ్చిన అనంతరం పక్కా గృహాల నిర్మాణాలు నిలిచిపోయాయి. అనంతరం కొత్తప్రభుత్వం ఏర్పడిన అనంతరం పక్కా గృహాల నిర్మాణాలకు సంబంధించి శ్రద్ధ కనబరచకపోవడంతో నిర్మాణాలు ముందుకు కదిలే పరిస్థితి లేదు.

అసంపూర్తిగా నిర్మాణం



నరసాపురం పట్టణంలోని లే అవుట్‌లో నాకు ఇళ్లు మంజూరు కావడంతో వెంటనే నిర్మాణాలు చేపట్టాం. బేస్‌మెంట్ వరకూ పని పూర్తి చేశాం, అక్కడి నుంచి పనులు జరగడం లేదు. మావద్ద ఇంటి నిర్మాణ కాంట్రాక్ట్ తీసుకునన్న వ్యక్తి కూడా రావడం లేదు. అందువల్ల నిర్మాణం అసంపూర్తిగా ఉంది.

– కోట్ల లీల, నరసాపురం

మౌలిక సదుపాయాలు కల్పించాలి



తాగునీరు, రోడ్లు, డ్రెయినేజి వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. గతేడాది మే నెలలోనే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాను. మా ఇంటి పక్కన ఏ ఇల్లూ నిర్మాణం అవ్వడం లేదు.

– నల్లా సత్యవతి. నరసాపురం.

సచివాలయ ఉద్యోగిపై దాడి

నరసాపురం రూరల్: మొగల్తూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 1వ గ్రామ సచివాయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొల్లు దుర్గా ప్రసాద్‌పై బుధవారం నలుగురు వ్యక్తులు దాడి చేశారు. ఎస్సై జి.వాసు తెలిపిన వివరాల ప్రకారం మొగల్తూరు జాతీయ రహదారి వై జంక్షన్ నుంచి బైక్‌పై వస్తున్న దుర్గా ప్రసాద్‌ను కడలివారిపాలేనికి చెందిన నలుగురు యువకులు దారి కాచి బైక్ రోడ్డుపై అడ్డుపెట్టి హెల్మెట్‌తో దుర్గా ప్రసాద్‌పై దాడి చేశారు. ఈ దాడి గురించి దుర్గాప్రసాద్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నరసాపురం రూరల్: మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు మొగల్తూరు ఎస్సై జి.వాసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యాలపల్లి గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన కొపనాతి నర్సింహస్వామి కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడన్నారు. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ కేసును నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణ విచారిస్తున్నారు.

ఓటరు నమోదు గడువు పెంచాలి

భీమవరం: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు గడువు పెంచాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరావుకు బుధవారం వినతిపత్రం అందించారు. గత వారం రోజులుగా ఎడతెరపిలేని వర్షాల కారణంగా ప్రభుత్వం స్కూళ్లకు సెలవు ప్రకటించిందని అందువల్ల ఉపాధ్యాయులు ఓటరు నమోదు దరఖాస్తులను రెవెన్యూ కార్యాలయాల్లో సమర్పించలేకపోయారని వారం రోజులు సమయం పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.